సాక్షి శ్రీకాకుళం

మంగళవారం । 22 । జూలై । 2025



క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలి

గ్రీవెన్స్‌లో 80 అర్జీలు స్వీకరించారు. సమస్యలు ఏకరువు పెట్టారు.

- 10లో



'హద్దు'మీరుతున్న నేరాలు

నేరాలు హద్దు మీరుతున్నాయి. అంతర్రాష్ట్ర దొంగల బెడద పెరుగుతోంది.

- 10లో

పోలీసుల అదుపులో అమ్మినాయుడు?

శ్రీకాకుళం క్రైమ్ : ఫరీదుపేటలోని వైఎస్సార్ సీపీ కార్యకర్త సత్తారు గోపి హత్య కేసులో కీలకంగా భావిస్తున్న టీడీపీ నాయకుడు కొత్తకోట అమ్మినాయుడును పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. సోమవారం రాత్రి సీఐ ఎం.అవతారం, ఆమదాలవలస, జేఆర్‌పురం ఎస్ఐలు బాలరాజు, చిరంజీవి మరో ఎస్ఐ, 15 మందికిపైగా కానిస్టేబుళ్లు మూడు జీపుల్లో ఫరీదుపేట వెళ్లారు. పికెటింగ్ అని ప్రజలు భావించేలోగా అమ్మినాయుడు ఇంటికి వెళ్లి అదుపులోకి తీసుకుని ఎచ్చెర్ల స్టేషన్‌కు తరలించినట్లు భోగట్టా.

న్యూస్‌రీల్

'పచ్చి రొట్ట ఎరువుతో మట్టికి జీవం'

శ్రీకాకుళం పాతబస్టాండ్: పచ్చి రొట్ట ఎరువుతో మట్టికి జీవం అందుతుందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో పచ్చి రొట్ట ఎరువులకు సంబంధించి వాల్ పోస్టర్‌ను కలెక్టర్‌తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పచ్చి రొట్ట పైర్లను వాడటం ద్వారా 25 శాతం ఎరువు ఆదా అవుతుందని పేర్కొన్నారు. జీవన ఎరువుల కాలపరిమితి 36–12 నెలలని, గడువు మించని ఎరువులు వాడాలన్నారు. రసాయనిక ఎరువులు, కీటక నాశకాలతో కలిపి వేయకూడదని వివరించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి త్రినాథ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

● బొచ్చె.. చేతిలోకి వచ్చె..



మెళియాపుట్టి మండలం మాకనాపల్లి గ్రామంలోని పెద్ద చెరువులో 10 కిలోల చేప వలకు చిక్కింది. సోమవారం చెరువులో చేపల వేట చేయడంతో ఈ చేప చిక్కినట్లు పెద్దపద్మాపురం గ్రామానికి చెందిన మాణిక్యం తెలిపారు. చాలాకాలంగా వలకు దొరక్కపోవడంతో ఇంత బరువు పెరిగిందని, దీన్ని బొచ్చె చేప అంటారని పేర్కొన్నారు.

– మెళియాపుట్టి

ప్రభుత్వ పాఠశాలలో కుమార్తెను చేర్పించిన హెచ్‌ఎం

మందస: మందస మండలం భిన్నళి మదనాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.దివ్య ఆదర్శంగా నిలిచారు. ఆమె ఇటీవలే బదిలీపై ఈ పాఠశాలకు వచ్చారు. కానీ ఇక్కడ కేవలం 15 మంది మాత్రమే ఉన్నారు. దీంతో ఆమె తన కుమార్తె చాతుర్యను రెండో తరగతిలో చేర్పించారు. దీంతో మరో నలుగురు కూడా బడిలో చేరారు. ఈ సందర్భంగా మందస ఎంఈఓ–2 సుందర్ సోలమన్ సోమవారం పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయురాలిని అభినందించారు.

శ్రీముఖలింగంలో శివ స్వాములు



ప్రధాన ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న శివ స్వాములు

జలుమూరు: ఆషాఢ మాసం ఆఖరి సోమవారం ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో శివస్వాములు మధుకేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతి పూజతో ప్రారంభించి 42 రోజుల దీక్ష అనంతరం స్వామికి ఏకవార అభిషేకాలు, అర్చనలు అనంతరం వారాహి అమ్మవారికి మొక్కులు చెల్లించి కుంకుమ పూజలు నిర్వహించారు. శివ స్వాములు తేనె, పానకాలు, ఇరుముడులు స్వామికి సమర్పించి గోలెం మొక్కులు తీర్చారు. ఏటా స్వామికి దీక్షతో మొక్కులు తీర్చి ఇరుముడి సమర్పించుకుంటామని రాయగడకు చెందిన గురుస్వామి జితేంద్ర స్వామి తెలిపారు.

కొత్తూరులో ఎరువుల కోసం పాట్లు



కొత్తూరు వ్యవసాయ కార్యాలయం ముందు ఎరువుల కోసం పాట్లు పడుతున్న రైతులు

కొత్తూరు: కొత్తూరులో ఎరువుల కోసం రైతులకు పాట్లు తప్పడం లేదు. మండలంలోని 27 గ్రామ సచివాలయాలకు కొత్తూరు, పారాపురం, దిమిలి గ్రామ సచివాలయాలకు 20 టన్నుల చొప్పున యూరియాను ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే సోమవారం యూరియా విక్రయిస్తున్నట్లు కొత్తూరు గ్రామ సచివాలయం వ్యవసాయ సహాయకురాలు చెప్పడంతో రైతులు యూరియా కోసం పెద్ద సంఖ్యలో వ్యవసాయ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. యూరియా తక్కువ రావడంతో అందరికీ ఇబ్బంది తప్పలేదు. రైతులు ఎక్కువ కావడంతో వారి ఆధార్ కార్డు నంబర్లు రాసుకుని యూరియా కోసం చీటీలు ఇచ్చి మంగళవారం యూరియా పంపిణీ చేస్తామని రైతులను పంపించారు.

● ఆషాడ శోభ



శ్రీకాకుళం చిన్న బజారులోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో సోమవారం వాసవీ మాతను శాకంబరిగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. - శ్రీకాకుళం కల్చరల్

● తల్లికి వందనమేదీ..?



తల్లికి వందనం పడలేదంటూ లబ్ధిదారులు గళమెత్తారు. శ్రీకాకుళం సమీపంలోని సింగుపురం స్కూల్‌లో 120 మందికిపైగా తల్లికి వందనం డబ్బులు పడలేదు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు కలెక్టర్ గ్రీవెన్స్‌సెల్ వద్ద సోమవారం ధర్నాకు దిగారు. తమకు ఎందుకు డబ్బులు పడలేదో చెప్పాలని డిమాండ్‌చేశారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

● అంగన్ వేడి



అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.కల్యాణి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.ఆదినారాయణమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు శ్రీకాకుళంలోని గుజరాతిపేటలోగల ఐసీడీఎస్ శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేశారు. - శ్రీకాకుళం అర్బన్

దాచాలన్నా.. దాగలేదు!

ఇసుక గుట్టలమాటున అక్రమాల గుట్టు

ముద్దాడపేటలో అక్రమ ర్యాంప్

- పాత నిమ్మ తొర్లువాడ ఘటనతో వెలుగులోకి
- మీడియా పరిశీలనతో బయటపడిన బాగోతం
- అధికారులు వస్తారని తెలిసి జేసీబీ, లారీలను బయటకు పంపేసిన అక్రమార్కులు
- అయినప్పటికీ మీడియా కంటపడిన జేసీబీలు, లారీలు
- పాత నిమ్మ తొర్లువాడకు 4 కిలోమీటర్ల మేర ఇసుక కొట్టేసే ప్లాన్



ఈ ఫొటోలో ఉన్న జేసీబీలు చూడండి. ఆదివారం రాత్రి గొడవ జరిగిన పాత నిమ్మ తొర్లువాడకు దగ్గరలో ఉన్న ముద్దాడపేటలో అక్రమంగా నిర్వహిస్తున్న ఇసుకర్యాంపులో ఉన్న జేసీబీలు ఇవి. అనుమతుల గడువు మే 31న ముగిసిపోయినప్పటికీ ఇష్టారీతిన టీడీపీ నాయకులు తవ్వకాలు జరుపుతున్న దృశ్యమిది. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా మూడు జేసీబీలతో నదిలో తవ్వేసి సొమ్ము చేసుకుంటున్నారు.



పాత నిమ్మ తొర్లువాడలో ఆదివారం జరిగిన ఘటనతో అటు అధికారులు, ఇటు మీడియా రావడంతో ఎక్కడ బండారం బయటపడుతుందోనని యుద్ధప్రాతిపదికన ముద్దాడపేటలో అక్రమ ర్యాంపు నుంచి ఆ మూడు జేసీబీలను బయటకు తరలిస్తున్న దృశ్యమిది. ఎవరి కంటాపడకుండా గుట్టుగా తరలిస్తున్నా నిఘా పెట్టిన మీడియాకి దొరికిపోయారు.



అక్రమంగా నిర్వహిస్తున్న ముద్దాడపేట ఇసుకర్యాంపు నుంచి తక్షణమే లారీలను బయటకు పంపేసిన దృశ్యమిది. అటు మీడియా, ఇటు అధికారులు వస్తే ఇసుక అక్రమ బాగోతం బయటపడుతుందని నదిలోనుంచి లారీలను ఖాళీ చేయించేశారు



ఈ ఫొటోలు చూడండి. ముద్దాడపేట అక్రమ ఇసుకర్యాంపులో తవ్వి తీసిన ఇసుకను బయట పెద్దపెద్ద గుట్టలుగా వేసిన దృశ్యాలివి. కొండల మాదిరిగా ఇప్పుడా ఇసుక గుట్టలు ఉన్నాయి. అక్కడి నుంచే ఇసుక విక్రయించి తరలిస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం



ఇసుకాసురుల గుట్టు అధికారుల సాక్షిగా రట్టయ్యింది. ఇసుక తవ్వకాలు అడ్డుకున్నారని గ్రామస్తులపై దాడులకు తెగబడిన వారు సోమవారం అధికారులు, మీడియాకు భయపడి తమ వాహనాలను తరలిస్తూ అసలు నిజాన్ని చెప్పకనే చెప్పేశారు. పాత నిమ్మ తొర్లువాడలో ఇసుక అక్రమ తవ్వకాలు అడ్డుకున్నారన్న అక్కసుతో సుమారు 100 మంది గ్రామస్తులపై ఆదివారం రాత్రి దాడి చేసి బీభత్సం సృష్టించారు. పోలీసుల కళ్లముందే ఇంటింటికీ వెళ్లి కత్తులు, కర్రలతో చావబాదారు. పోలీసులు చోద్యం చూశారే తప్ప నిలువరించలేకపోయారు. ఆదివారం రాత్రి జరిగిన ఘటనతో గ్రామస్తులు భయాందోళన చెందారు. సోమవారం ఉదయానికి 'సాక్షి' పత్రికలో పతాక శీర్షికన ప్రచురితం కావడంతో మిగతా మీడియా అక్కడికి పరుగులు తీసింది. ఈ సమయంలో అక్కడ మరో అవినీతి బాగోతం బయటపడింది.

చోద్యం చూసిన అధికారులు..

పాత నిమ్మతొర్లువాడకు కాస్త దూరంలో ఉన్న ముద్దాడపేటలో అక్రమంగా నిర్వహిస్తున్న ఇసుకర్యాంపు వ్యవహారం వెలుగు చూసింది. అనుమతుల్లేకుండా మూడు జేసీబీలు, వందలాది లారీలతో తరలిస్తున్న ఇసుక గుట్టు రట్టయ్యింది. మీడియాను చూసి యుద్ధప్రాతిపదికన మూడు జేసీబీలను అక్కడి నుంచి తరలించేశారు. అంతేకాకుండా నదిలోకి వచ్చిన లారీలను బయటకు పంపించేశారు. అంతేకాకుండా ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న లారీలను ఎక్కడికక్కడ నిలిపివేయమని సూచించడంతో ఎక్కడికక్కడ ఆపేశారు. మొత్తానికి పాత నిమ్మ తొర్లువాడ దాడి ఘటనతో ముద్దాడపేటలో ఇసుక అక్రమ రవాణ గుట్టురట్టయ్యింది. కాకపోతే అధికారులు మాత్రం ఎప్పటిలాగే చోద్యం చూశారు. అక్కడ పెద్ద పెద్ద ఇసుక పోగులు, నది బయట జేసీబీలు బయటకి వచ్చేస్తున్నా చర్యలు తీసుకోలేదు.

అసలు ప్లాన్ ఇదీ..

వాస్తవంగా పాత నిమ్మతొర్లువాడ గ్రామస్తులు ఆదివారం ఆందోళన చేయకపోతే కొత్తవలస నుంచి సుమారు నాలుగు కిలోమీటర్ల వరకు నది ఒడ్డున రోడ్లు వేసి వర్షాలు పడేటప్పుడు ఆ రోడ్డుకు ఆనుకుని తవ్వకాలు జరిపి, ఇసుక అమ్మకాలు జరపాలన్నదే ప్లాన్‌గా స్పష్టమవుతోంది. ఇంత జరిగాక అధికారులు ఆ కుట్రలు, ప్లాన్‌ను అడ్డుకుంటారో.. లేదంటే ఎప్పటిలాగా టీడీపీ బాస్‌లు చెప్పినట్లు చూసీ చూడనట్లు వదిలేస్తారో వేచి చూడాలి.

అంత భయమెందుకు...

టీడీపీ అధినేతల నుంచి అధికారులకు ఏ స్థాయి ఒత్తిళ్లు ఉన్నాయో తెలియదు గానీ ఇసుక అక్రమార్కుల జోలికి వెళ్లకుండా భయపడుతున్నారు. అంతెందుకు ఆదివారం రాత్రి పాత నిమ్మ తొర్లువాడ గ్రామస్తులపై దాడి చేసిన గూండాలను పట్టుకునే ప్రయత్నం కూడా జరిగిన దాఖలాల్లేవ్. కనీసం అక్కడున్న సీసీ కెమెరాలు పరిశీలించి తదనుగుణంగా చర్యలు తీసుకోలేదు. ఈలోపు సీసీ కెమెరాల ఫుటేజీ మాయమైనా ఆశ్చర్యపోనక్కర్లేదు. ఇదంతా వ్యూహాత్మకమే అనిపించేలా ఉంది. టీడీపీ పెద్ద మనుషులే దాడిచేయడంతో ఈ కేసును నీరుగార్చేసేలా మొత్తం పరిస్థితి కనబడుతోంది.

● ఇదేనా సుపరిపాలన..?



కొత్తవలస, పాత నిమ్మతొర్లువాడ ఇసుక ర్యాంపు వద్ద పోలీసులతో, ఆ గ్రామ ప్రజలతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి కోట గోవిందరావు

ఆమదాలవలస: దాడులు చేయడమే కూటమి ప్రభుత్వం సుపరిపాలనా..? అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి కోట గోవిందరావు ప్రశ్నించారు. ఆమదాలవలస మండలంలోని పాతనిమ్మ తొర్లువాడ గ్రామంలో ఆదివారం రాత్రి ఇసుకాసురులు ఆ గ్రామ ప్రజలపై చేసిన దాడిని ఖండిస్తూ సోమవారం ఇసుక ర్యాంపును సందర్శించారు. ఎస్ఐ ఎస్.బాలరాజుతో మాట్లాడారు. దాడిలో ప్రాణాలు కోల్పోతే ఎవరు సమాధానం చెబుతారని ప్రశ్నించారు. గ్రామస్తులకు అన్యాయం జరిగితే సహించేది లేదని అన్నారు. కూటమి నాయకులు అక్రమార్జన కోసం ఎగబడుతున్నారని, ప్రజలకు అందాల్సిన సంక్షేమానికి గండి కొడుతున్నారని అన్నారు. గాయపడిన వారికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఆయన తోపాటు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ పథకాలపై సమీక్ష



మాట్లాడుతున్న ఎన్‌ఎల్‌ఎం బృందం నాయకులు సునీల్ బంటా

శ్రీకాకుళం పాతబస్టాండ్: కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖకు చెందిన జాతీయ స్థాయి మానిటరింగ్ (ఎన్‌ఎల్‌ఎం) బృందం జిల్లాలో అమలవుతున్న జాతీయ పథకాలపై సోమవారం సమీక్ష నిర్వహించింది. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ఈ సమీక్షకు బృంద సభ్యులు సునీల్ బంటా, నాథు సింగ్ నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా బృంద సభ్యులు మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధి పథకాల అమలులో పారదర్శకత, సమగ్రత అవసరమని పేర్కొన్నారు. ముఖ్యంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ, దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన–గ్రామీణ, పీఎం గ్రామ సడక్ యోజన, నేషనల్ సోషల్ అసిస్టెన్స్ ప్రోగ్రామ్, సంసద్ ఆదర్శ్ గ్రామ యోజన తదితర పథకాల అమలు స్థితిగతులపై సమీక్ష నిర్వహించారు. ప్రజల వద్దకు పథకాల లబ్ధి పూర్తిస్థాయిలో చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ బృందం జిల్లాలో ఐదు రోజులు పలు గ్రామాల్లో పర్యటిస్తుందని డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

● శ్రీకాకుళం ఆర్డీవో సాయి ప్రత్యూష



ఆమదాలవలస మండలం కొత్తవలస, పాత నిమ్మతొర్లువాడ గ్రామాల మధ్య ఇసుక ర్యాంపును పరిశీలించి విచారిస్తున్న ఆర్డీవో సాయిప్రత్యూష

ఆమదాలవలస: మండలంలోని నాగావళి నది పరివాహక ప్రాంతమైన కొత్తవలస, పాత నిమ్మతొర్లువాడ వద్ద నిర్వహిస్తున్న ఇసుక ర్యాంపు తవ్వకాలు నిబంధనల మేరకు చేపట్టాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని శ్రీకాకుళం ఆర్డీవో సాయి ప్రత్యూష ర్యాంపు నిర్వాహకులకు హెచ్చరించారు. ఆదివారం అర్ధరాత్రి ఇసుక ర్యాంపు నిర్వాహకులకు గ్రామస్తుల మధ్య జరిగిన వివాదంపై ఆమె సోమవారం విచారణ చేపట్టారు. తొలుత ఇసుక ర్యాంపును పరిశీలించి అనంతరం పాతనిమ్మతొర్లువాడ గ్రామస్తులతో పోలీసులు సమక్షంలో మాట్లాడారు. ముందుగా గ్రామస్తులను ఆర్డీవో విచారించగా నాగావళి పరివాహక ప్రాంతంలో శ్మశాన వాటికతో పాటు యువకులు ఆటలాడే ప్రదేశం ఉందని, ర్యాంపు నిర్వాహకులు ఇక్కడ వాహనాలు తీసుకెళ్తుండడం వల్ల మైదాన ప్రాంతం కోతకు గురవుతోందని తెలిపారు. అయినా ఆపకుండా తవ్వకాలు చేస్తుండడంతో జేసీబీల వద్ద తవ్వకాలు అడ్డుకున్నామని తెలిపారు. ఈ సంఘటన జరిగిన తర్వాత ఆమదాలవలస ఎస్ఐ బాలరాజు, సిబ్బందితో వచ్చి మాట్లాడారని, కానీ తర్వాత ర్యాంపు నిర్వాహకులు కొందరు రౌడీలను తీసుకువచ్చి తమపై దాడి చేశారని వారు ఆర్డీవోకు తెలిపారు. దీనిపై ఆర్డీవో ర్యాంపు నిర్వాహకులను ప్రశ్నించగా స్థానికులు తవ్వకాలు వద్దు అంటే వాహనాలు నిలిపేసి వెళ్లిపోయామని, దాడులకు తమకు సంబంధం లేదని తెలిపారు. దీంతో గ్రామస్తులకు ర్యాంపు నిర్వాహకులకు వాగ్వాదం జరిగింది. ఇసుకర్యాంపు వద్ద ఉన్న సీసీ కెమెరాల్లో దాడుల దృశ్యాలు చూపించి దాడిచేసిన వారిని గుర్తించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. కెమెరాలు పనిచేయడం లేదని ర్యాంపు నిర్వాహకులు చెప్పడంతో.. స్థానికంగా ఉన్న టీడీపీ నాయకుల అండదండలతో టీడీపీ గూండాలతోనే దాడి చేయించారని గ్రామస్తులు ఆరోపించారు. ఇదంతా విన్న ఆర్డీవో ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పొన్నాడ సుధాకర్ స్పందిస్తూ గ్రామస్తులు సూచించిన మూడు ప్రదేశాలను విడిచిపెట్టి ప్రభుత్వ నిబంధనల మేరకు ఇసుక తవ్వకాలు చేపట్టాలని సూచించారు. ఇసుక లారీల రాకపోకలకు ఏర్పాటుచేసిన రహదారికి తక్షణమే అనుమతులు తీసుకోవాలని లేకుంటే చర్యలు తప్పవని ఆర్డీవో హెచ్చరించారు. విచారణలో ఆమదాలవలస తహసీల్దారు రాంబాబు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'టెక్కలిలో కొత్త మద్యం డిపో ఎందుకు..?'



నినదిస్తున్న వామపక్ష నేతలు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను విడదీసి కొత్త డిపోను టెక్కలిలో ఎందుకు పెడుతున్నారని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడిని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొన్న శ్రీనివాసరావు, సీపీఐ (ఎంఎల్) జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ ప్రశ్నించారు. మూడు తరాలుగా డిపోలో పనిచేస్తున్న హమాలీల ఉపాధిని కాపాడాలన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఇందిరానగర్ కాలనీలో సోమవారం రౌండ్ టేబుల్ సమావేశంనిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో అచ్చెన్నాయుడిని కలిసి వినతిపత్రం ఇచ్చినప్పుడు టెక్కలిలో కొత్త డిపో ఏర్పాటు చేయకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చి ఇప్పుడు మళ్లీ టెక్కలిలో ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. జిల్లా ప్రజలు శివారు భూములకు నీరు ఇవ్వమని అడుగుతున్నారే తప్ప కొత్తగా డిపోలు పెట్టి బీరు అడగడం లేదని ఎద్దేవా చేశారు. ఎచ్చెర్ల డిపోను యథావిధిగా కొనసాగించి హమాలీల ఉపాధిని కాపాడాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

ఎస్పీ గ్రీవెన్సుకు 56 వినతులు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ మరియు పరిష్కారం (గ్రీవెన్సు)లో ప్రజల నుంచి 56 వినతులు అందాయి. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి వినతులు స్వీకరించి సకాలంలో న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.

తలకొరివి పెట్టిన కుమార్తె



అంత్యక్రియలు నిర్వహిస్తున్న కుమార్తె దీపిక

కవిటి: కన్న తండ్రికి కుమార్తె తలకొరివి పెట్టిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. కవిటికి చెందిన గుడియా రవి(49) సోమవారం ఇంటి వద్దనే కుప్పకూలిపోయి మృతి చెందారు. అయితే అతడికి కుమారులు లేకపోవడంతో గ్రామస్తుల సహకారంతో కుమార్తె దీపిక అంత్యక్రియలు నిర్వహించింది. ఈ ఘటన పలువురిని కంటతడి పెట్టించింది. ఇంటికి పెద్దదిక్కు కోల్పోవడంతో ఆ కుటుంబం రోడ్డున పడింది.

రోడ్డు ప్రమాదంలో మాజీ సైనికుడు మృతి



పోతనపల్లి దుష్యంత్ (ఫైల్)



దుష్యంత్ మృతదేహం

కాశీబుగ్గ: పలాస మండలం బొడ్డపాడు గ్రామానికి చెందిన పోతనపల్లి దుష్యంత్ (42) అనే మాజీ సైనికుడు తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మెస్‌కో కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్న దుష్యంత్ ఆదివారం బోనాల పండుగ సందర్భంగా రద్దీలో రోడ్డు దాటుతుండగా అతివేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. స్వగ్రామానికి మంగళవారం ఉదయం మృతదేహం చేరనుంది. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. దుష్యంత్ మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- మీ కోసంలో 80 అర్జీల స్వీకరణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: మీ కోసంలో వచ్చే అర్జీలపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదికలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి ఆయన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలు పరిష్కారమైతే పరిష్కరించాలని లేదా క్షేత్రస్థాయిలో వెళ్లి విచారణ చేసి అర్జీదారునికి సమాచారం అందించాలన్నారు. రెవెన్యూ, మున్సిపల్ కార్పొరేషన్, జిల్లా పంచాయతీ, సాంఘిక సంక్షేమ శాఖ, జిల్లా వైద్యారోగ్య శాఖ, జిల్లా విద్యాశాఖ, సర్వే అండ్ లాండ్ రికార్డులు, వ్యవసాయం, పంచాయతీరాజ్, డ్వామా, మహిళా శిశు సంక్షేమం, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ తదితర శాఖల సమస్యలపై 80 అర్జీలు స్వీకరించారు. అర్జీల స్వీకరణలో ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను పరిశీలిస్తే...

- శ్రీకాకుళం మండలంలోని సింగుపురం గ్రామ మండల ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 128 మంది విద్యార్థులకు తల్లికి వందనం పథకం నగదు పడలేదని తల్లిదండ్రులు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. కేవలం ఆ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న 12 మంది విద్యార్థులకు మాత్రమే ఈ పథకం నగదు వచ్చిందని తెలిపారు. ఈ విషయమై పలుమార్లు పాఠశాల హెచ్ఎం, సచివాలయం, మండల కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని వెల్లడించారు. ఫిర్యాదు చేసినవారిలో పిన్నింటి హేమలత, నాగమణి, కృష్ణవేణి, గూన కుమారి, సౌజన్య, జ్యోతి తదితరులు ఉన్నారు.
- నగరంలోని ఒక ప్రైవేటు విద్యాసంస్థలో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన అలికాన సేతుమాధవ్‌కి కళాశాల యాజమాన్యం ఇంటర్ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం లేదని విద్యార్థి మేనమామ నల్లబారికి శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. కళాశాలలో ప్రవేశ సమయంలో రెండేళ్లకు రూ.90,000 లు ఫీజు మాట్లాడుకున్నామని, అయితే ఇప్పుడు అదనంగా మరో రూ.40,000లు చెల్లించాలని అంటున్నారని వాపోయారు. అదనంగా ఫీజు చెల్లిస్తేనే ధ్రువీకరణ పత్రాలు ఇస్తామని చెబుతున్నారన్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.
- గుర్తింపు లేని పత్రికలు నడుపుతూ, ప్రభుత్వ అనుమతులు లేకుండా తప్పుడు వార్తలు ప్రచురితం చేస్తూ, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతూ బ్లాక్ మెయిల్ వార్తలు రాస్తున్న రెండు చిన్న పత్రికలపై చర్యలు తీసుకోవాలని నగరానికి చెందిన పీపీ రమణ పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు.
- ఆమదాలవలస నియోజకవర్గంలోని పలు సమస్యలపై పీజీఆర్ఎస్‌లో ఆమదాలవలస నియోజకవర్గం స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి సువ్వారి గాంధీ ఫిర్యాదు చేశారు. ఆమదాలవలస రైల్వేస్టేషన్ ప్రాంతంలోని రోడ్డులో ట్రాఫిక్ అంతరాయం కలుగుతుందని, ప్రత్యామ్నాయంగా లక్ష్మడుపేట జంక్షన్ నుంచి కృష్ణాపురం రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. పొందూరు మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి గుడి వద్దనున్న ప్రధాన రహదారి నుంచి జగనన్న కాలనీ వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు.



కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న చింతాడ రవికుమార్

పారదర్శకంగా ఎరువులు సరఫరా చేయాలి

ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు పారదర్శకంగా ఎరువులు సరఫరా చేయాలని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ కోరారు. ఈ మేరకు పీజీఆర్ఎస్‌కు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు వినతిపత్రం అందజేశారు. పొందూరు మండలంలోని దల్లిపేట గ్రామ పంచాయతీ పరిధిలో వాస్తవ రైతులకు ఎరువులు అందకుండా, బ్లాక్ మార్కెట్‌కు తరలించడం జరుగుతోందని పేర్కొన్నారు. ఈ విషయమై గ్రామ సచివాలయం వద్ద రైతులు ఆందోళన చేయడం కూడా జరిగిందని తెలిపారు. స్థానిక వ్యవసాయ శాఖ అధికారులు వారిపై ఉన్న రాజకీయ ఒత్తిడి కారణంగా ఎటువంటి చర్యలు చేపట్టలేదని పేర్కొన్నారు. ఈ విషయంపై సమగ్ర దర్యాప్తు జరిపి బ్లాక్ మార్కెట్‌కు తరలించేందుకు ఎరువులను వెనక్కి తెప్పించి, రైతులకు సరిపడా ఎరువులను వెంటనే పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో దల్లిపేట సర్పంచ్ నీలవేణి తదితరులు పాల్గొన్నారు. అలాగే నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని విన్నవించారు.

రాజకీయ కక్ష సాధింపులో భాగమే



మాట్లాడుతున్న పిరియా విజయ తదితరులు

- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

ఇచ్ఛాపురం రూరల్: లిక్కర్ స్కాం పేరుతో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని అరెస్ట్ చేయడం రాజకీయ కక్ష సాధింపులో భాగమేనని జెడ్పీ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా విజయ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆమె మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచి డైవర్షన్ పాలిటిక్స్‌కు అధిక ప్రాధాన్యమిస్తోందని దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీ హయాంలో పారదర్శకంగా ప్రభుత్వం మద్యం దుకాణాలు నిర్వహిస్తే అవినీతికి ఆస్కారం ఎక్కడుందని ప్రశ్నించారు. ఎలాంటి ఆధారాలు లేకున్నా కక్ష సాధింపు కోసం మద్యం కుంభకోణం అంటూ అక్రమ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ ప్రశ్నించినవారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఆమెతో పాటు సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ బోర పుష్ప, నియోజకవర్గ యువజన అధ్యక్షుడు నర్తు ప్రేమ్‌కుమార్, వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరెడ్డి, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, నాయకులు నర్తు వరప్రసాద్, కారంగి త్రినాథ్, నీలాపు సారథిరెడ్డి, బచ్చు జగన్, నీలాపు జగదీష్‌రెడ్డి, లోపింటి దీనబంధు రెడ్డి, ఆశి పురుషోత్తమరెడ్డి, ఉదయ్ బెహరా, గండు మహాపాత్రో తదితరులు పాల్గొన్నారు.

మిథున్ రెడ్డి అరెస్టు అప్రజాస్వామికం

- ఎమ్మెల్సీ నర్తు రామారావు



ఇచ్ఛాపురం రూరల్: రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి అరెస్టు అప్రజాస్వామికమని, రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే అరెస్టు చేశారని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయడం చేతకాక, ప్రజల దృష్టిని మళ్లించేందుకు వైఎస్సార్‌సీపీ నేతలపై కక్ష సాధింపు చర్యలకు కూటమి ప్రభుత్వం తెరతీసిందన్నారు. ప్రభుత్వ అరాచకాలను ప్రశ్నిస్తున్నందుకే మిథున్ రెడ్డిపై లిక్కర్ స్కామ్ తప్పుడు కేసు బనాయించి అరెస్టు చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో పారదర్శకంగా మద్యం పాలసీ అమలైందని గుర్తు చేశారు. అక్రమ అరెస్టులకు వైఎస్సార్‌సీపీ నాయకులు భయపడే ప్రసక్తే లేదన్నారు.

ఆవేదన వ్యక్తం చేస్తే..నోటీసులా..?

- జనసేన పార్టీ నిర్ణయాలపై సర్వత్రా విస్మయం
- హిరమండలం, శ్రీకాకుళం ఏఎంసీ చైర్మన్ల ఎంపికపై నిరసన వ్యక్తం చేసిన జనసైనికులు
- శ్రీకాకుళంలో ఇద్దరికి, హిరమండలంలో ఒకరికి షోకాజ్ నోటీసులు
- పార్టీ జిల్లా అధ్యక్షుడి నిర్ణయంపై జనసేన కార్యకర్తల ఆగ్రహం

అరసవల్లి: జనసేన కార్యకర్తలు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడి తీరుపై గరంగరంగా ఉన్నారు. జిల్లాలో ఇటీవల ప్రకటించిన మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ల ఎంపికలో భాగంగా శ్రీకాకుళం ఏఎంసీ చైర్ పర్సన్‌గా దారపు జ్యోత్స్న, హిరమండలం ఏఎంసి చైర్‌పర్సన్‌గా మామిడి రామకృష్ణారావులను ఎంపిక చేశారు. వీరిద్దరూ జనసేనలో కొత్తగా చేరిన వారు కావడంతో.. ముందు నుంచి పార్టీలో ఉన్న వారు నిరసన వ్యక్తం చేశారు. హిరమండలంలో ఎంపికను వ్యతిరేకించిన అక్కడి జనసేన నేత వి.సింహాచలం, అలాగే శ్రీకాకుళంలో వ్యతిరేకించిన ధర్నాకు దిగిన జిల్లా పార్టీ కార్యదర్శి కొండా ఉదయ్‌శంకర్, సంయుక్త కార్యదర్శి ఎ.గురుప్రసాద్‌లకు జనసేన అధిష్టానం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. అధిష్టానం ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ ఈ మేరకు నోటీసులను మొత్తం ముగ్గురికి జారీ చేశారు. ఇదే జిల్లాలో ఇప్పుడు చర్చనీయాంశమైంది. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ నిర్ణయాలపై ఇప్పుడు పెద్ద చర్చే నడుస్తోంది. ప్రజాస్వామ్యబద్ధంగా ఆవేదన వ్యక్తం చేయడం నేరమా అంటూ రాజకీయ విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. కాగా జనసేన కార్యకర్తలు, వీరమహిళలు సైతం తమ నిరసనలకు అర్థం ఉందని, పార్టీలో కష్టపడి పనిచేసేవారికి గుర్తింపు ఇవ్వకపోవడం దారుణమని కూడా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కనక దుర్గమ్మకు ఆషాడం సారె



ఆషాడ మాసం సారెతో సేవా సమితి సభ్యులు

గార: విజయవాడ కనక దుర్గమ్మకు మండలానికి చెందిన శ్రీదుర్గా భవానీ సేవా సమితి సభ్యులు ఆషాడ మాసం సారె సోమవారం సమర్పించారు. సమితి ఏర్పడ్డాక తొలిసారిగా పాత సంప్రదాయాల కొనసాగింపుగా గురు భవానీలు, భక్తులు 41 మంది కలిసి వెళ్లి సారెను అందజేశారు. సారెలో పసుపు, కుంకుమ, చీర, జాకెట్టు, గాజులు, పువ్వులు, సుగంధ ద్రవ్యాలతో పాటు పూజా సామాగ్రి, ప్రసాదం వంటివి ఉన్నాయి. పూజల్లో పాల్గొన్న విశ్వహిందూ పరిషత్ ఉపాధ్యక్షుడు శ్రీరంగం మధుసూదనరావు మాట్లాడుతూ అమ్మవారికి సారె సమర్పణ చేస్తే పాడి పంటలు సక్రమంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సావాడ రామారావు, కార్యదర్శి పాదిలాపు అప్పారావు, అరసవల్లి రాజు, ఇప్పిలి రమణ, గొర్లె శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

బైక్‌పై నుంచి జారిపడిన మహిళ మృతి

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని చింతాడ గ్రామానికి చెందిన రైస్ మిల్లులో పనిచేస్తున్న బొంతల భూలోకం అనే మహిళ బైక్‌పై నుంచి జారిపడి చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. రెండు రోజుల కిందట అదే మిల్లులో పనిచేస్తున్న వ్యక్తి బైక్‌పై నుంచి ఆమె పడిపోయి గాయపడ్డారు. కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. ఘటనపై బాధితురాలి కుమారుడు బొంతలు దారినాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.రాము తెలిపారు.

మున్సిపల్ కార్మికుల నిరసన

ఇచ్ఛాపురం: తమ సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్మికులు నాలుగు రోజులుగా సమ్మె చేపడుతున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా సోమవారం స్థానిక బస్టాండ్ కూడలిలో మున్సిపల్ కార్మికులంతా వారి న్యాయపరమైన సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో సీఐటీయూ ఆధ్వర్యంలో అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకుడు రమేష్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

యువకుడి ఆత్మహత్య



మృతుడు మహేష్ (ఫైల్)

గార: మద్యానికి బానిసైన యువకుడు ఆత్మహత్య చేసుకొని కుటుంబానికి తీవ్ర శోకాన్ని మిగిల్చాడు. కళింగపట్నం పంచాయతీ శిలగాం గ్రామానికి చెందిన దీర్ఘాశి మహేష్ (24) ఆదివారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మహేష్ 2022లో సీమెన్‌గా చేరి మూడు నెలలకే తిరిగి ఇంటికి వచ్చేశాడు. ఆ తర్వాత మద్యానికి బానిసై తల్లిదండ్రులను ఇబ్బంది పెట్టేవాడు. ఆదివారం సాయంత్రం కూడా స్వల్ప గొడవ జరిగింది. దీంతో పక్కనే ఉన్న నాన్నమ్మ ఇంట్లోకి వెళ్లి ఫ్యానుకు ఉరేసుకున్నాడు. సోమవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. తండ్రి సింహాచలం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సీ రామిరెడ్డి తెలిపారు.

కాపర్ వైర్ బండిల్స్ చోరీ

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలోని పీఎన్‌కాలనీ జీరో లైన్‌లో నిర్మాణ దశలో ఉన్న ఒక బిల్డింగ్ వద్ద ఆరు కాపర్ వైర్ బండిల్స్ చోరీకి గురైనట్లు రెండో పట్టణ సీఐ ఈశ్వరరావు సోమవారం వెల్లడించారు. ఏవీఎం టవర్స్ కన్‌స్ట్రక్షన్ బిల్డింగ్ వద్ద ఉదయం బండిల్స్ లేకపోవడాన్ని గుర్తించిన వాచ్‌మెన్ వెంటనే సూపర్‌వైజర్ కల్లేపల్లి కోటేశ్వరరావుకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడన్నారు. దీంతో ఘటనా స్థలానికి వెళ్లి ఆయన పరిశీలించి బిల్డింగ్ యజమానికి తెలుపగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించడంతో కోటేశ్వరరావు తమను ఆశ్రయించినట్లు సీఐ చెప్పారు. దీనిపై ఎస్ఐ-2 రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

'హద్దు'మీరుతున్న నేరాలు

- రాష్ట్రాల సరిహద్దులు దాటి సిక్కోలులోకి అంతర్రాష్ట్ర దొంగలు
- ప్రశాంత సిక్కోలుపై బీహార్, రాజస్థాన్, వెస్ట్‌బెంగాల్ గ్యాంగుల దాడులు
- దారి దోపిడీలు, భారీ చోరీలు, గంజాయి రవాణాలో ఘనులు



డిజిటల్ అరెస్టు సైబర్ నేరంలో భాగంగా అరెస్టయిన కర్ణాటక, కేరళ రాష్ట్రాల నిందితులు (ఫైల్)

శ్రీకాకుళం క్రైమ్ : ప్రశాంత సిక్కోలును అంతర్రాష్ట్ర దొంగలు హడలెత్తిస్తున్నారు. దారిదోపిడీలు, భారీ చోరీలు, గంజాయి రవాణా, సైబర్ నేరాలతో వణుకు పుట్టిస్తున్నారు. ఓవైపు ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి సారథ్యంలోని జిల్లా పోలీసు యంత్రాంగం డ్రోన్లు, సీసీ కెమెరాలు, సర్వైలెన్సుతో నిఘా పెడుతున్నా.. ప్రత్యేక పోలీసు బలగాలను ప్రధాన చెక్ పోస్టుల వద్ద మఫ్టీల్లో పెడుతున్నా.. ఎప్పటికప్పుడు కేసులు ఛేదిస్తున్నా.. ఏదో ఓ మూల నుంచి అంతర్రాష్ట్ర నేరస్తులు చొరబడి సవాళ్లు విసురుతునే ఉన్నారు. ముఖ్యంగా బీహార్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, వెస్ట్‌బెంగాల్, డెహ్రాడూన్, ఛత్తీస్‌గఢ్, జైపూర్, రాయపూర్, ఒడిశా, బెంగళూర్ నుంచి వస్తున్న గ్యాంగులు నేరాల్లో ప్రధాన భూమిక పోషిస్తున్నాయి. వివిధ కేసుల్లో పట్టుబడేవారికంటే పరారీలో ఉన్నవారే నేరంలో కీలకపాత్రధారులు కావడం గమనార్హం.

- ఇటీవల ఆటోల్లో చైన్‌స్నాచింగ్ గ్యాంగ్‌లు రెచ్చిపోతున్న సంగతి తెలిసిందే. రెండో పట్టణ పోలీసులు విజయనగరానికి చెందిన కొందరిని పట్టుకున్నారు. వీరి గ్యాంగ్ కొత్తవలసలో కొంతమంది, రాజమహేంద్రవరంలో గోకవరం కేంద్రంగా మరి కొంతమంది ఉన్నారు. వీరేకాక జిల్లాలో నెలకోసారి వచ్చిపోయే ఉత్తరప్రదేశ్ ఆటోగ్యాంగ్‌లతోనే అత్యంత ప్రమాదమని పోలీసులు భావిస్తున్నారు.
- వెస్ట్‌బెంగాల్ నుంచి చైన్‌స్నాచింగ్ గ్యాంగులు అధికంగా వస్తున్నారు. వీరు కోలకతా నుంచి విజయవాడ వరకు హైవేల్లో నేరాలకు పాల్పడుతుంటారు.
- ఒడిశా రాష్ట్రం, గంజాం జిల్లా బరంపురానికి చెందిన సుజిత్‌కుమార్ పాడి, బాలకృష్ణ సాహు జిల్లాలోని నాలుగుచోట్ల చోరీలకు పాల్పడి ఏడున్నర తులాల బంగారం తో కొత్తూరు పోలీసులకు చిక్కారు. జిల్లాలో 2016 నుంచి 2024 వరకు 32 నేరాలు చేసిన ఘనత వీరిది. బైక్‌పై వెళ్తూ ఒంటరి మహిళల పుస్తెలు తెంపి పారిపోవడం వీరి నైజం. వీరిని ఈ ఏడాది జనవరి 10న పట్టుకున్నారు.
- ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్‌కు చెందిన భయంకర షేర్ మహ్మద్ 18 మంది గ్యాంగ్‌లో నూర్‌హసన్ సభ్యుడు. ఇర్ఫాన్ అహ్మద్, అబ్దుల్‌గఫూర్‌లతో కలిపి 140 దొంగతనాలు చేశారు. ఏపీతో పాటు ఉత్తరాఖండ్, రాజస్థాన్, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్‌ల్లో చేశారు. 32 కేసుల్లో అరెస్టు చేశారు. మన జిల్లాలో 14 కేసులున్నాయి. వీరిని ఏప్రిల్ 15న అరెస్టు చేశారు.
- రాజస్థాన్ జైపూర్‌కు చెందిన ఆదిత్య పవార్ కుటుంబసభ్యులు మూడేళ్లుగా జిల్లాలోని హైవేల్లో దారిదోపిడీలు చేస్తున్నారు. ఆగి ఉన్న లారీలు, ఇతర వాహనదారులను దాడి చేసి మొబైళ్లు, నగదు, బండ్లు దోచేస్తుంటారు. గుడారాలు వేసుకుంటూ పగలు బొమ్మలు, దుప్పట్ల వ్యాపారం, రాత్రుళ్లు దోపిడీలు చేయడం వీరి నైజం. వీరిని జూన్ 6న అరెస్టు చేశారు.
- గంజాయి, ఇతర మత్తుపదార్థాల అక్రమ రవాణాలో పక్క రాష్ట్రం ఒడిశాలోని వివిధ జిల్లాల నుంచి వచ్చే స్మగ్లర్లు కోకొల్లలు. జిల్లాలో గతేడాది 50 కేసుల్లో 1322 కిలోలు, ఈ ఏడాది 40కు పైగా కేసుల్లో 600 కిలోలకు పైగా గంజా పట్టుబడిందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఎస్పీ ఏమన్నారంటే..

అంతర్రాష్ట్ర నేరస్తులు జిల్లాలో చొరబడుతున్నారన్న అంశంపై ఇటీవల ఎస్పీ మహేశ్వరరెడ్డి స్పందిస్తూ.. అంతర్రాష్ట్ర నేరస్తులపైనా సర్వైలెన్స్ పెట్టామని చెప్పారు. ఆయా రాష్ట్రాల అధికారులతో మాట్లాడి ఫింగర్ ప్రింట్స్, పాత అఫెండర్స్ లిస్టు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికే పర్లాఖిముడి, పాతపట్నం, ఇచ్ఛాపురం, గొప్పిలి చెక్‌పోస్టులలో విస్తృతం తనిఖీలు చేస్తున్నామని తెలిపారు.

సైబర్ దాడులు సైతం..

- ఇటీవల జిల్లాలోని ఓ వైద్యురాలిని డిజిటల్ అరెస్టు పేరిట సైబర్ కేటుగాళ్లు రూ.13.5 లక్షలకు టోకరా వేశారు. కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు చెందిన రూమన్ షరీఫ్, నౌఫలా షెరీన్, నిజాముద్దీన్‌సీపీ, ఫహద్ అహ్మద్, రెయాన్ అహ్మద్ ఖురేషీతో పాటు దుబాయ్ దేశంలో ఉంటున్న సలీమ్‌లు లింక్ సిస్టమ్‌గా ఈ మోసానికి ఒడిగట్టారు. వీరిలో ముగ్గురినే పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు దర్యాప్తును మరింత లోతుగా చేస్తే హర్యానాకు చెందిన గ్యాంగ్, కీలక విదేశీ గ్యాంగ్ దొరికే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు.

'కిరాయి' కేటుగాళ్లు..

- గత డిసెంబరులో శ్రీకాకుళం నగరానికి చెందిన ఓ వ్యాపారి మరో వ్యాపారి ఇంట్లో దోపిడీ చేసేందుకు తెలంగాణ రాష్ట్రానికి చెందిన సయ్యద్ ఇర్షద్ అలమ్, చిగురుపాటి ఆంజనేయులు, యాకుబ్, సజ్జు, కె.భానుప్రసాద్‌లతో కిరాయి ఇస్తానని చేతులు కలిపి పన్నాగం పన్ని విఫలమయ్యాడు. పోలీసులు అప్పట్లో నలుగురినే అరెస్టు చేశారు. మిగతా ఇద్దరు కీలక నేరస్థులు పట్టుబడలేదు.
- కవిటి మండలం ఆర్.కరాపాడుకు చెందిన నిండు గర్భిణిని చంపేందుకు తన భర్తే ఒడిశా వాసులతో రూ. 3.50 లక్షలకు కిరాయి మాట్లాడి అతికిరాతకంగా తుదముట్టించాడు.